క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

సీతమ్మధార: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా నిష్పత్తి ప్రకారం దేశంలో గాని రాష్ట్రంలో గాని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎంతో కృషి చేస్తోందన్నారు. బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలని, ప్రత్యేక రాష్ట్రంలో కేంద్ర బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నక్కల్లా నరసింహారావును నియమించినట్లు చెప్పారు. అనంతరం బీసీ సంఘం నాయకులంతా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు నూకాలమ్మ, మల్లేష్, నాగేశ్వరరావు, వేణు, రమణ వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో అమ్మవారిని పూజారమ్మ విజయమ్మ ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు పులఖండ శ్రీకాంత్‌శర్మ కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50ల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఈ నెల 11న జ్ఞానాపురం ఆర్చ్ వద్ద సుమారు 60 ఏళ్ల వయసున్న వ్యక్తి తెలివిలేకుండా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అతడిని అంబులెన్స్‌లో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఆ వ్యక్తి ఈ నెల 14న రాత్రి 7 గంటల సమయంలో మృతిచెందాడు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. అతడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఏపీటీఎస్ఏ జిల్లా నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ అండ్ అకౌంటెంట్ సర్వీస్ అసోసియేషన్(ఏపీటీఏఎస్ఏ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జిల్లా పరిషత్ సమీపంలో ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జి. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా వి.అజయ్ కుమార్ యాదవ్, జిల్లా ట్రెజరర్‌గా పి.రామ్ దిలీప్, సహాధ్యక్షుడిగా ఎం.దివ్య, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు.

మండుటెండలో చల్లచల్లగా..

వేసవిలో శీతల పానీయాలకు డిమాండ్

జోరుగా వేసవి వ్యాపారాలు

భానుడి భగభగల నుంచి ప్రజలకు ఉపశమనం



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో జ్యూస్ తాగుతున్న స్థానికులు

సీతమ్మధార: వేసవి ప్రారంభంతోనే భానుడు భగభగలాడుతున్నాడు. సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఐదారు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండ వేడిమిని తాళలేక నగరవాసులు అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడిమితో పాదచారులు, వివిధ పనులపై బయటకొచ్చే వారు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో శీతల పానీయాల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో రోజంతా కిటకిటలాడుతున్నాయి.



నక్కవానిపాలెంలో చెరకు రసం తాగుతున్న పాదచారులు

పెద్ద సంఖ్యలో దుకాణాలు

సీతమ్మధార, నక్కవానిపాలెం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గురుద్వారా, ఎంఎంటీసీ కాలనీ, సత్యం జంక్షన్, రేసపువానిపాలెం, నార్త్ ఎక్స్‌టెన్షన్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు, చెరకు రసం, పండ్ల రసాల దుకాణాలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశారు. వేసవి తాపం నుంచి ఉపశమనం అందించే చెరకు రసం, లస్సీ, మజ్జిగ, షర్బత్, లెమన్‌సోడా, కొబ్బరి బొండాలు, ఫ్రూట్ జ్యూస్‌లు, మిల్క్‌షేక్స్, పుచ్చకాయలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీంతో వ్యాపారులు అధిక ధరలకు వీటిని విక్రయిస్తున్నారు.

ఫ్రూట్ జ్యూస్‌లు

వేసవి తాపాన్ని తీర్చేందుకు సీజనల్ ఫ్రూట్స్‌తో చేసిన సుమారు 25 రకాల జ్యూస్‌లను అందుబాటులో ఉంచారు. యాపిల్, సపోటా, ద్రాక్ష, బొప్పాయి, వాటర్‌మిలన్, క్యారెట్, స్వీట్ పంప్కిన్, మిల్క్‌షేక్ తదితర జ్యూస్‌లకు డిమాండ్ పెరిగింది. ఆర్డనరీ జ్యూస్ రూ.25కు, ప్యూర్ జ్యూస్ రూ.40కు, మిల్క్‌షేక్స్ రూ.50కు చల్లచల్లగా అందిస్తున్నారు. వేసవిలో శరీరానికి చల్లదనం కలిగించే పెరుగుతో చేసిన లస్సీ వైపు జనం ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దాహంతోపాటు ఆకలిని తీర్చే డ్రైఫ్రూట్ లస్సీకి డిమాండ్ ఎక్కువగా ఉంది.



ఆరోగ్య ప్రదాయిని కొబ్బరి బొండం



వేసవి తాపాన్ని తీర్చడంలో కొబ్బరి బొండాలు అగ్రస్థానంలో నిలుస్తాయని చెప్పనక్కర్లేదు. ఏకాలంలోనైనా కొబ్బరి నీటిని ఆరోగ్యం కోసం చాలామంది సేవిస్తుంటారు. కూల్ డ్రింక్‌ల కంటే కొబ్బరి నీరు ఆరోగ్య ప్రదాయిని కావడంతో వాటికి డిమాండ్ ఎల్లప్పుడూ అధికంగానే ఉంటుంది. వేసవిలో కూల్ కొబ్బరి నీరు దాహార్తిని తీర్చి వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. నిన్న మొన్నటి వరకు చిన్నవి రూ.రూ.30, పెద్దవి రూ.40 చొప్పున విక్రయించిన బొండాలు వేసవి ప్రభావంతో రూ.50కు చేరుకున్నాయి. ధర ఎక్కువైన ఆరోగ్య ప్రదాయిని కావడంతో కొబ్బరి బొండాలకు డిమాండ్ తగ్గలేదు.



సీతమ్మధారలో కర్బూజా తింటున్న స్థానికులు

చెరకు రసం.. చల్లదనం



కొబ్బరి బొండాల తరువాత చెరకు రసానికి విపరీతమైన డిమాండ్ ఉంది. చెరకు రసం దాహాన్ని తీర్చడమే కాకుండా శరీరానికి గ్లూకోజ్‌ను అందించి తక్షణ శక్తిని, చల్లదనాన్ని ఇస్తుంది. అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి తెచ్చిన చెరకుతో విక్రేతలు చెరకు రసాన్ని ఐస్‌తో కలిపి కూల్‌కూల్‌గా అందిస్తున్నారు.

సుగంధి, మారేడు, నిమ్మసోడాలు



సుగంధి వేళ్లు, మారేడు కాయల రసంతో తయారు చేసిన షర్బత్, నిమ్మసోడాల విక్రయాలు ఊపందుకున్నాయి. సుగంధి, మారేడు కాయల నుంచి రసం తీసి పంచదార పాకంతో కలిపి తయారు చేస్తున్న షర్బత్‌లకు డిమాండ్ ఎక్కువే. ఇవి దాహాన్ని తీర్చడమే కాక వేసవి తాపాన్ని తగ్గించి, శరీరాన్ని చల్లబరుస్తాయని విక్రేతలు అంటున్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీజీఎం అశోక్‌కుమార్, సిబ్బంది

సీతమ్మధార: గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ బి.అశోక్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రభావంతో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ప్రధాన స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొని, అనేక సార్లు జైలు శిక్ష అనుభవించి సస్యశ్యామలమైన ఆంధ్ర రాష్ట్రాన్ని త్యాగంతో మనకు అందించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాణిపేట: విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలోని సీఈవో చాంబర్‌లో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆయన ఆశయాలను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- కింగ్ జార్జ్ ఆస్పత్రి(కేజీహెచ్)లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హద్దు మీరితే పీడీ యాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ రమణ

సీతమ్మధార: అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ తప్పదని ఈస్ట్ జోన్ ఏసీపీ లక్ష్మణమూర్తి హెచ్చరించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు మద్యం తాగి షాపుల వద్ద అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిగా ఉండాలని, గొడవలకు పాల్పడినా, బెదిరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. హాజరు కాని రౌడీషీటర్లకు ఫోన్‌లో మాట్లాడి కౌన్సెలింగ్ చేశారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌కు తప్పనిసరిగా రావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిగా నడుచుకోండి

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ డి.వి.రమణ కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల రోజు వారి విధానాలపై ఆరా తీశారు. మంచిగా నడుచుకోవాలని, అల్లరు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గంగాధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్: డిప్యూటీ మేయర్ సతీష్



మాధవధార హైస్కూల్‌లో పరీక్షల ఏర్పాట్లు చేస్తున్న హెచ్‌ఎం హేమలత



టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

మురళీనగర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మురళీనగర్ పరిసరాల్లోని ఎంఎస్ఎం పాఠశాల, మాధవధార జీవీఎంసీ పాఠశాల, అల్లూరి సీతారామరాజునగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ మూడు పాఠశాలకు చెందిన విద్యార్థులకు జంబ్లింగ్ పద్ధతిలో పరీక్ష కేంద్రాలకు కేటాయించారు.

- మాధవధార హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, హెచ్‌ఎం బి.హేమలత తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. మాధవధార హైస్కూల్ నుంచి 155 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యారు. వీరిలో బాలికలు 80 మంది, బాలురు 75 మంది ఉన్నారు. ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ హైస్కూల్ కేంద్రానికి 216 మందిని కేటాయించారు. వీరిలో 200 రెగ్యులర్, 16 మంది ప్రైవేటు విద్యార్థులున్నారు. 9 గదులు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఈ పాఠశాల నుంచి 99 మంది పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలికలు 52 మంది, బాలురు 47 మంది. వీరికి మాధవధార, ఎంఎస్ఎం పాఠశాల కేటాయించారు. హెచ్‌ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. డిపార్ట్‌మెంట్ అధికారిగా దివ్యరాజును నియమించారు. ఎంఎస్ఎం ఉన్నత పాఠశాలకు 207 మంది విద్యార్థులను కేటాయించారు. సీఎస్‌గా నాగేశ్వరరావును నియమించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


కంచరపాలెం: టెన్త్ విద్యార్థులు ఒత్తిడిని వీడి పరీక్షలు రాయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సూచించారు. ఊర్వశి కూడలి గౌరీనగర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ప్రశాంతంగా ఉంటూ మంచి మార్కులు సాధించే దిశగా నడుచుకోవాలన్నారు. టెన్త్ పరీక్షల్లో 10/10 మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మంచి ప్రోత్సాహకాలు అందిస్తానని ఆయన తెలిపారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని మేయర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లా ఎర్నికుమార్ యాదవ్, నమ్మి జ్యోతేష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం రసవత్తరంగా ‘భక్త ప్రహ్లాద’

ముగిసిన ఆహ్వాన నాటకోత్సవాలు



నాటకంలో హిరణ్యకశిపుడి వికటాట్టహాసం



శ్రీహరిపై తన భక్తిని చాటుతున్న భక్త ప్రహ్లాదుడు

మురళీనగర్: కేవీ మెమోరియల్ ఆర్ట్స్, విశాఖ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విశాఖ శ్రీ సాయి కళానికేతన్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం వారు రాష్ట్ర ప్రభుత్వంచే బంగారు నంది బహుమతి పొందిన ‘భక్త ప్రహ్లాద’ పౌరాణిక నాటకం ప్రదర్శించారు. ఆద్యంతం రసవత్తరంగా సాగిన ఈ నాటకం వీక్షించిన ప్రేక్షకులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. కార్యక్రమ నిర్వహణకు వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, పి.వెంకట సూర్యనారాయణ రాజు, పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి సహకరించారు. ఈ సందర్భంగా నటులను ఘనంగా సత్కరించారు.

సత్యసాయి సేవాదళ్ సభ్యులకు శిక్షణ



శిబిరంలో మాట్లాడుతున్న విశ్వనాథ్‌రెడ్డి

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యులకు ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయిబాబా దివ్య అవతార శత జయంతి ఉత్సవాలు–2025 సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సేవాదళ్ సభ్యులకు శిక్షణ శిబిరం జరిగింది. ముందుగా పతాక ఆవిష్కరణ, ఓంకారం, వేదం, నామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంస్థ రాష్ట్ర సేవాదళ్ జాయింట్ కో–ఆర్డినేటర్ సి.విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 6 వేల గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వెయ్యి గ్రామాల్లో సేవలు చేయాలని సంకల్పించగా.. ప్రస్తుతం అనేక గ్రామాల్లో జరుగుతున్నాయన్నా రు. ఆయా సేవా కార్యక్రమాల్లో సేవాదళ్ సభ్యులంతా భాగస్వాములుగా నిలవాలని కోరారు. పలువురు జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాపోషకుడికి ఘన సత్కారం



పల్లా చంద్రమౌళి దంపతులను సత్కరిస్తున్న చౌదరి అప్పారావు, వరప్రసాద్ తదితరులు

మురళీనగర్: నిత్యం భారతీయ కళలను ప్రోత్సహిస్తున్న వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళిని పలు నాటక సమాజాలు ఘనంగా సత్కరించాయి. జాతీయ ఆహ్వాన నాటక ప్రదర్శనల సందర్భంగా కేవీ మెమోరియల్ ఆర్ట్స్, పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు తరఫున పల్లా చంద్రమౌళి, అరుణ దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించి, సేవలను కొనియాడారు. ఆయన వాకర్స్ క్లబ్ కార్యదర్శి, కోశాధికారి, రెండు సార్లు అధ్యక్షుడిగా ఆయన పని చేశారు. చంద్రమౌళికి ముఖ్యంగా కళలు, కళాకారులంటే విపరీతమైన అభిమానం. వాకర్స్ క్లబ్ ప్రాంగణాన్ని కళా ప్రదర్శనలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. నేటి యువతరానికి కళారంగాన్ని పరిచయం చేయాలనే తపన ఆశయంతో పనిచేస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో 12 సార్లు రంగస్థల నాటకాలను ఏర్పాటు చేసి కళాకారులను ప్రోత్సహించారు. పల్లా చంద్రమౌళి రంగస్థలానికి చేస్తున్న సేవలను గుర్తిస్తూ పలు సంఘాలు ఆయనను ఘనంగా సత్కరించాచి. ఈ సందర్భంగా కేవీ మెమోరియల్, పోర్ట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, పి.వెంకట సూర్యనారాయణరాజు మాట్లాడుతూ కళారంగానికి చంద్రమౌళి చేస్తున్న సేవలను కొనియాడారు.

ఆధ్యాత్మిక పరిమళం.. రామదాసు సంగీతోత్సవం

ఏయూక్యాంపస్: ఆధ్యాత్మిక పరిమళాన్ని నింపేలా శ్రీ భద్రాచల రామదాసు జయంతి సంగీతోత్సవం సాగింది. బీచ్ రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ శారదా అన్నమయ్య సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో రామదాసు జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను, నగరవాసులు ఆధ్యాత్మిక సంగీత సాగరంలో ఓలలాడించింది. కార్యక్రమాన్ని సాహితీవేత్త సంగీత, విశ్లేషకుడు పారుపల్లి శ్రీరామ చంద్రమూర్తి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యాలయం సంస్థాపకాచార్యుడు పారుపల్లి సత్యనారాయణ కార్యక్రమ విశిష్టతను వివరించారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆంకాలజిస్ట్ వంశీధర

సీతమ్మధార: అవగాహనతో బ్రెస్ట్ క్యాన్సర్‌ను దూరం చేయవచ్చని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వంశీధర పుట్రేవు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠం రోడ్డులోని వీ హెల్త్ కేర్‌లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల మూలంగా అధిక శాతం మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో ఈ వ్యాధిని దూరం చేయవచ్చని చెప్పారు. సుమారు 100 మంది మహిళలకు యువరాజ్ సింగ్ ఫౌండేషన్ వైద్య బృందం డాక్టర్ మాధురి, డాక్టర్ చరిత, తేజశ్రీ, మధువర్షిణి బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. మహిళల వైద్య నిపుణులు డాక్టర్ మస్రత్ వైద్య పరీక్షలు నిర్వహించి, సలహాలిచ్చారు. బీపీ, సుగర్, ఈసీజీ, దంత వైద్య పరీక్షలు చేసి సూచనలందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ సెక్రటరీ చింత నేతాజీ, డిస్ట్రిక్ట్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బచ్చు బ్రహ్మానందం, వీ హెల్త్ కేర్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, వీ హెల్త్ కేర్ హెడ్ చిన్నం కృష్ణ, హాస్యనటుడు కోరుకొండ రంగారావు, వనమాలి అడ్మిన్ ప్రతినిధి నాదెళ్ల జ్యోతి, దంత వైద్యులు శౌర్య, స్వర్ణలత వీ డెంటల్ హాస్పిటల్ అడ్వాన్ మేనేజర్ సిహెచ్.పార్వతి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ఎంవీపీకాలనీ: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఎంవీపీ కాలనీ సెక్టార్–5లోని ఐక్యత భవన్‌లో ఆదివారం సీఐటీయూ విశాఖ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ మోదీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే దేశంలోని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, చమురు సంస్థలను వివిధ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టిందన్నారు. అందులో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కూడా ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నారని చెప్పారు. 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి, ఏప్రిల్ నుంచి వీటిని అమలు చేయాలని చూస్తోందన్నారు.



ఆర్.కె. బీచ్‌లో కోతకు గురై ప్రమాదకరంగా మారిన పార్కులో సిమెంటు గట్టుపై పలువురు యువకులు కూర్చుని తీరాన్ని వీక్షిస్తున్నారు. ఏ క్షణమైనా ప్రమాదం జరిగే అవకాశముంది. ఇలాంటి నిర్మాణాలను యుద్ధప్రాతిపాదికన చేపట్టి తీసుకోవలసిన చర్యలపై అధికార యంత్రాంగం తాత్సారం చేయడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం